క్లుప్తంగా

డీలర్ల మండల కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

మద్దిరాల : రేషన్ డీలర్ల నూతన మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రేషన్ డీలర్ల మండల అధ్యక్షురాలిగా తాళ్లపల్లి సంధ్య, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. తమ ఎన్నికకు సహకరించిన రేషన్ డీలర్లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీలర్లు గూడ వెంకట్‌రెడ్డి, సురేష్, దుగ్యాల వెంకటేశ్వర్‌రావు, సత్తయ్య, లింగయ్య, పుల్లయ్య, విక్రం తదితరులు పాల్గొన్నారు.

మున్నూరు కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

హుజూర్‌నగర్‌రూరల్ : మున్నూరుకాపులకు ప్రత్యేక ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ మున్నూరుకాపు సంఘం కార్యనిర్వాహక కార్యదర్శి కోల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం మండల పరిధిలోని లింగగిరిలో రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.500కోట్ల నిధులు కేటాయించాలని, రాష్ట్రంలోని 33జిల్లాల్లో కాపు విద్యార్థులకు వసతిగృహాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చలమలా రాఘవయ్య, కాసర్ల నాగేశ్వరరావు, సతీష్, చినవెంకటేశ్వరరావు, భిక్షం, రమేష్, రామకృష్ణ, వెంకటేశ్వర్లు, నాగసైదులు తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



తిరుమలగిరిలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

తిరుమలగిరి : ఈ నెల 31న జరిగే మారోజు వీరన్న జయంతి ఉత్సవాల పోస్టర్‌ను విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం తిరుమలగిరిలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు రవీందర్, సోమాచారి, దీన్‌దయాళ్, ఉప్పలయ్య, నరేష్, మధు, చారి, నాని, శ్రీనివాస్, మహేందర్ పాల్గొన్నారు.

లచ్చయ్య మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న భుజంగరావు

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన ఒగ్గు లచ్చయ్య అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, ఒగ్గు సైదులు తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబ సభ్యులకు పరామర్శ



మృతురాలి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

నూతనకల్ : మండల పరిధిలోని చిల్పకుంట్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు బాణాల చంద్రమ్మ ఇటీవల మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతురాలి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు బాణాల సుదర్శన్‌రెడ్డి, బాణాల చంద్రారెడ్డి, మాతంగి వెంకన్న, బొడ్డుపల్లి అంజయ్య, అనిల్, అబ్బాస్ అలీ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి

నడిగూడెం : హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర స్థాయి సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు బండారు గుర్వయ్య కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి బాణాల అబ్రహం, నాయకులు కందుకూరి వీరబాబు, బండారు నాగరాజు, శ్రీనివాస్, బొడ్డుపల్లి కృష్ణయ్య, నెమ్మాది సత్యం, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

స్కావెంజర్లు లేక ఇబ్బందులు

- ప్రభుత్వ పాఠశాలల్లో కొరవడిన పరిశుభ్రత
- ఇబ్బందులు పడుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



తిరుమలగిరి పాఠశాలలో అపరిశుభ్రంగా మారిన మూత్రశాలలు

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు – మన బడి పథకం కింద లక్షల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నా ఎంతో ముఖ్యమైన పారిశుద్ధ్యాన్ని మాత్రం పట్టించుకోవడంలేదు. గతంలో ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్‌లు, స్వీపర్ల వ్యవస్థ ఉండేది. దీంతో వారు పాఠశాలలను ఊడ్చి పరిశుభ్రంగా ఉంచేవారు. కానీ కోవిడ్ –19 తర్వాత గత ప్రభుత్వం స్కావెంజర్ల వ్యవస్థను రద్దు చేసింది. పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణ ఆయా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఉండేలా ఆదేశించింది. అయితే జీపీ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు ఇప్పటికే తీవ్ర పని భారం ఉండటం వల్ల అదనంగా పాఠశాలల శుభ్రతను పట్టించుకోలేకపోతున్నారు. ఈ కారణంగా పాఠశాలల పరిశుభ్రత ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారింది.

తిరుమలగిరి మండలంలో ఇలా..

తిరుమలగిరి మండలంలో 6 ఉన్నత, 2 ప్రాథమికోన్నత, 35 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 2466 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. కానీ మండలంలోని దాదాపు అన్ని పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. కొన్ని చోట్ల మూత్రశాలలకు నీటి సౌకర్యం కూడా లేదు. మరికొన్ని శిథిలావస్థకు చేరాయి. పంచాయతీ, మున్సిపాలిటీలలో సరిపోను సిబ్బంది లేక పాఠశాలలను శుభ్రం చేసేందుకు ఎవరినీ పంపే పరిస్థితి లేదు. దీంతో పాఠశాలల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారి దుర్గంధం వెదజల్లుతోందని విద్యార్థులు, ఉపాధ్యాయులు వాపోతున్నారు. ప్రతి పాఠశాలలో తప్పనిసరిగా స్కావెంజర్లను నియమించాలని వారు కోరుతున్నారు.

స్కావెంజర్లను నియమించాలి

పాఠశాలలో స్కావెంజర్లు లేకపోవడంతో మరుగుదొడ్లను శుభ్రం చేయడం లేదు. మూత్రశాలలు అధ్వానంగా మారుతున్నాయి. ప్రతి పాఠశాలలో స్కావెంజర్లను నియమించాలి.

– వర్షిత, 4వ తరగతి

ఇబ్బందులు పడుతున్నాం



కోవిడ్‌కు ముందు ప్రతి పాఠశాలలో స్కావెంజర్‌ను తాత్కాలిక పద్ధతిన నియమించారు. కానీ గత కొన్నేళ్ల నుంచి వారిని తొలగించడంతో ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలలకు తప్పనిసరిగా స్కావెంజర్లను నియమించాలి.

– సీహెచ్.సోమయ్య, హెచ్ఎం, వెలిశాల

జిల్లా అధికారులకు తెలిపాం



గ్రామాల్లో, మున్సిపాలిటీల పరిధిలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను శుభ్రం చేయడానికి పారిశుద్ధ్య సిబ్బంది వస్తున్నారు. కొన్నిసార్లు వారు రాకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

– ఐ.శాంతయ్య, ఎంఈఓ

యాదవ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ



చివ్వెంల : క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న యాదవ ఉద్యోగులు

చివ్వెంల : దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీ లింగమంతుల స్వామి (పెద్దగట్టు) ఆలయ ప్రాంగణంలో ఆదివారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా వెంకటేశ్వర్లు, వీరబోయిన వెంకటేశ్వర్లు, తండు శ్రీనివాస్, వూర రామ్మూర్తి, మర్యాద సైదులు, వీరస్వామి యాదవ్, లింగయ్య, భిక్షపతి, చలపతిరావు, వసంత సత్యనారాయణ పిళ్లైయాదవ్, అల్లి నాగయ్య, మహేష్, దశరథ్, వెంకట్, నాగయ్య, శ్రీశైలం, యాదగిరి, దేవలింగం పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన బీఆర్ఎస్

మునగాల : మిగులు బడ్జెట్‌తో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పుల కుప్పగా మార్చిందని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు చింతకాలయ నాగరాజు ఆరోపించారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొమ్మిదిన్నర ఏళ్లుగా తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ బీసీ వర్గాలను పట్టించుకోకుండా అడ్డగోలుగా సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ పార్టీల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందన్నారు. బీసీ రుణాలను మంజూరు చేయకుండా బీఆర్ఎస్ పార్టీ బీసీలను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ రుణాలను విడుదల చేయాలని ఆయన కోరారు.

పలువురికి ఘనంగా సన్మానం



నాగారం : మాచిరెడ్డిపల్లిలో సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న జీపీ సిబ్బంది



నూతనకల్ : చైర్మన్ దంపతులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని మాచిరెడ్డిపల్లి గ్రామంలో ఈనెలాఖరుతో సర్పంచ్ పదవి కాలం ముగుస్తుండటంతో గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డిని, ఉపసర్పంచ్ వడ్డే మహేష్, వార్డు సభ్యులను గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది ఆదివారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజాసేవ చేసిన వారికి ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సంతోష, ఆశ కార్యకర్త జయమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ మణెమ్మ, మరియమ్మ, లక్ష్మి, చంద్రకళ, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఉపేందర్‌కు సన్మానం



అర్వపల్లి : ఉపేందర్‌ను సన్మానిస్తున్న యువకులు

అర్వపల్లి : తెలంగాణ స్టూడెంట్స్ యూత్ అసోసియేషన్(టీఎస్ వైఏ) ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమితులైన జాజిరెడ్డిగూడెం మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన వేముల ఉపేందర్‌ను ఆదివారం గ్రామంలో గ్రామ యువకులు, అతడి స్నేహితులు ఘనంగా సన్మానించారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉపేందర్‌ను నియమించిన రాష్ట్ర అధ్యక్షుడు రింగు రాంబాబు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చల్ల నర్సయ్యలకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మచ్చ హరీష్, పాల్వాయి మహేష్, వద్దిగళ్ల బన్నీ పాల్గొన్నారు.

పీఏసీఎస్ చైర్మన్‌కు సన్మానం

నూతనకల్ : ఇటీవల పీఏసీఎస్ చైర్మన్‌గా ఎన్నికైన నాగం జయసుధసుధాకర్‌రెడ్డి దంపతులను పూర్వ విద్యార్థులు ఆదివారం ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993–94 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు చైర్మన్ దంపతులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొడ్డుపల్లి అంజయ్య, మాతంగి వెంకన్న, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, నోముల వెంకట్‌రెడ్డి, కొలిచెల్మ ఉపేందర్, ఒగ్గు రమేష్, ఎండీ అబ్బాస్ అలీ, శ్రీనివాస్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గత ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థకు నష్టం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దామోదర్‌రెడ్డి

భానుపురి : ప్రస్తుతం కేంద్రంలో ఉన్న మోదీ ప్రభుత్వం, గతంలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వాల విధానాల కారణంగా విద్యావ్యవస్థకు తీవ్ర నష్టం జరిగిందని మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల కోసం ప్రతి గ్రామానికి ఒక ప్రభుత్వ పాఠశాల నెలకొల్పామని అన్నారు. ఆనాడు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం గణనీయంగా ఉండేదని, కానీ గత పదేళ్ల కాలంలో కేంద్ర, రాష్ట్రాల్లో ఉన్న బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు విద్యావ్యవస్థను అగమ్యగోచరంగా మార్చాయన్నారు. రేషనలైజేషన్ పేరుతో ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రోత్సహించడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం పడిపోయిందన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు అహర్నిశలు పాటుపడుతోందని తెలిపారు. పేద విద్యార్థులకు తప్పకుండా మంచి సౌకర్యాలు, విద్యను అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు గోపగాని రవికుమార్, నాయకులు కొనపర్తి యశ్వంత్, ఒర్సు మున్నా, తండు విజయ్‌కృష్ణ, గడ్డం నాగరాజు, జక్కల అభినయ్, గోపగాని నవీన్, జటంగి మురళి, యరగాని వీరబాబు, అఖిల్, సామ సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలి



మద్దిరాలలో మాట్లాడుతున్న ఎస్‌ఏ రజాక్

మద్దిరాల : పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తు చేసుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ రజాక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 3 ఏళ్ల క్రితం డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులకు ఫిబ్రవరి 6వ తేదీలోపు ఎమ్మెల్సీ ఓటుకు దరఖాస్తులు చేసుకునేలా కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, జిల్లా నాయకులు దుగ్యాల రవీందర్ రావు, రావుల వెంకన్న, వద్దాణం మధుసూదన్, ఎంపీటీసీ సిరంశెట్టి వెంకన్న, దొంతు అవిలయ్య, సర్పంచ్‌లు లావుడ్యా వెంకన్న, సూరారపు గౌతమిరాజు, వీరన్న, జలేందర్, రేసు వెంకన్న, కొమరయ్య, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రస్టు ఆత్మకూరు మండల అధ్యక్షుడిగా వీరబాబు



వీరబాబును అభినందిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ గ్రామానికి చెందిన వరికుప్పల వీరబాబు తెలంగాణ వడ్డెర సంఘం చారిటబుల్ ట్రస్ట్ మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సూర్యాపేటలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు అతడికి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వీరబాబు మాట్లాడారు. వడ్డెర కులస్తులకు ఎస్టీ జాబితాలో చోటు సంపాదించడమే ధ్యేయంగా పోరాటాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు దండుగుల సైదులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇరగదిండ్ల అంజయ్య, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ, పల్లపు ఉదయ్, శ్రీకాంత్, పల్లపు మల్లయ్య, కుంచం వెంకన్న, కుంచం కృష్ణ, గోగుల శ్రీను, ఓర్సు ఉపేందర్, కుంచం గోపి, గోగుల చిట్టి, గోగుల నాగరాజు, కుంచం లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్



అర్వపల్లి శివారులో హైవేరోడ్డు వెంట జమ్మిచెట్లతో నిండిపోయిన ట్రాన్స్‌ఫార్మర్

అర్వపల్లి : నకిరేకల్–తానంచర్ల 365 హైవేపై అర్వపల్లి శివారులో పొలాల వెంట ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జమ్మి, కంపచెట్లతో నిండిపోయింది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీని వద్దకు వస్తేనే అక్కడ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నట్టు కనిపిస్తోంది. విద్యుత్ సిబ్బంది స్పందించి ప్రమాదాలు జరుగక ముందే కంపచెట్లను తొలగించాలని పలువురు కోరుతున్నారు.

జగన్నాథపురం వాసికి అవార్డు

మునగాల : మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన షేక్ జానీకి అవార్డు లభించింది. జానీ స్థాపించిన మదర్ థెరిస్సా బ్లడ్ బ్యాంక్ ద్వారా ఇప్పటికి 18సార్లు రక్తదానం చేశాడు. దీనిని గుర్తించిన తాసుబల్లి ఫౌండేషన్ నేషనల్ బ్లడ్ సర్వీసు సంస్థ జానీకి భారత సేవారత్న అవార్డు అందజేసింది.

జిల్లాస్థాయి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలి

మునగాల : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఫిబ్రవరి 3న జనవిజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను జయప్రదం చేయాలని జెడ్పీటీసీ నల్లపాటి ప్రమీల, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కమిటీ సభ్యుడు షేక్ జాఫర్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో సైన్స్ సంబరాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా షేక్ జాఫర్ మాట్లాడుతూ.. 30ఏళ్లుగా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం మండల కేంద్రంలో పలువురు గ్రామపెద్దల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. మండల స్థాయి ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొననున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గోళ్లమూడి రమేష్‌బాబు, మాజీ అధ్యక్షుడు డీవీఎస్.స్వామి, గ్రామ పెద్దలు నల్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ..

మునగాల మండలంలోని మాధవరంలో గ్రామానికి చెందిన వికారాబాద్ ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. సైన్స్ సంబరాలను విజయవంతం చేసేందుకు తనవంతు కృషిచేస్తానన్నారు.

హైవేపై ఇసుక.. తరచూ ప్రమాదాలు



సీతారాంపురం సమీపంలోని 71డీబీఎం కల్వర్టు వెంట హైవేపై పేరుకపోయిన ఇసుక



నకిరేకల్ -తానంచర్ల 365హైవేపై అర్వపల్లి శివారులో..

అర్వపల్లి : సూర్యాపేట–జనగామ, నకిరేకల్–తానంచర్ల జాతీయ రహదారులపై ఎక్కడికక్కడ ఇసుక పేరుకపోతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురెదురుగా వాహనాలు వచ్చినప్పుడు ఈ ఇసుకలో అదుపుతప్పుతున్నాయి. అర్వపల్లిలో రెండు జాతీయ రహదారులపై పలుచోట్ల ఇసుక పేరుకపోయి వాహన చోదకులు ఇక్కట్ల పాలవుతున్నారు. హైవేలపై ఇసుకను తొలగించాలని అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్లపై ఇసుకను తొలగించి, ప్రమాదాలను నివారించాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.



సూర్యాపేట-జనగామ 365బీ హైవేపై ..



అర్వపల్లిలోని జాజిరెడ్డిగూడెం రోడ్డులో..

జాడలేని మామిడి పూత

- వాతావరణ మార్పులతో దిగుబడిపై తీవ్ర ప్రభావం
- ఆందోళన చెందుతున్న రైతులు



నూతనకల్‌లో పూతపూయని మామిడి తోట

నూతనకల్ : వాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు మామిడి దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్‌లో మామిడి చెట్లు పూతతో నిండి ఉంటాయి. కానీ వాతావరణ మార్పుల కారణంగా జనవరి చివరి దాక కూడా మామిడి చెట్లు ఇగురు, పూత లేక వెలవెలబోయి దర్శనమిస్తున్నాయి. పరిస్థితి ఇలా ఉంటే దిగుబడి ప్రశ్నార్థకంగా మారనుంది. నూతనకల్ మండలంలో రైతులు సుమారు 1700ఎకరాల్లో మామిడి తోటలను సాగు చేస్తున్నారు. తోటల్లో సీజన్ వచ్చిందంటే సాధారణంగా ఎలాంటి సస్యరక్షణ చర్యలు చేపట్టకుండానే మామిడి పూత ఇరగ పూసేది. ప్రస్తుతం శాస్త్రవేత్తలు, ఉద్యాన శాఖ అధికారుల సూచనల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టి కంటికి రెప్పలా కాపాడుతున్నప్పటికీ పూత రాకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. వ్యాపారులు మామిడి పూత దశలోనే తోటలను రైతుల దగ్గర నుంచి కొనుగోలు చేస్తారు. కానీ ఈసారి ఇప్పటివరకు కూడా మామిడి పూత రాకపోవడంతో తోటలను కొనుగోలు చేయడానికి వ్యాపారస్తులు ఆసక్తి కనబర్చడం లేదు. వేల రూపాయలు ఖర్చు చేసినా కొన్ని చెట్లు మాత్రమే పూత దశకు వచ్చాయి. సాధారణంగా ఉగాది సమయానికి మామిడి పిందె స్థాయికి ఎదుగుతుంది. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది.

పూత కనిపించడం లేదు



ఈ సంవత్సరం మామిడి చెట్లకు పూత కనిపించడం లేదు. గతంలో ఈ సమయానికి చెట్లన్ని పూతతో నిండి ఉండేవి. ఇప్పుడు పూత వచ్చినా నిలిచే అవకాశం తక్కువగా ఉండటంతో దిగుబడిపై ప్రభావం పడుతోంది.

– తొట్ల హరీష్, రైతు, చిల్పకుంట్ల

వాతావరణ మార్పులతో ఆలస్యం



వాతావరణ మార్పుల వల్ల మామిడి పూత ఆలస్యంగా వస్తోంది. గత సంవత్సరం కూడా పూత ఆలస్యంగానే వచ్చింది. ఫిబ్రవరి, మార్చి వరకు పూత వచ్చే అవకాశం ఉంది. రైతులు పూత రావడం కోసం పొటాషియమ్ నైట్రేట్ 10గ్రాములు ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లీటర్ నీటిలో 3గ్రాముల బోరాన్, 2గ్రాముల జింక్ కలిపి పిచికారీ చేసినట్లయితే పూత విరివిగా వస్తుంది.

– స్రవంతి, ఉద్యానవన శాఖ అధికారి

కులాంతర వివాహంలో దివ్యాంగులు ఆదర్శం

మునగాల : నర్సింహులగూడెం గ్రామానికి చెందిన వీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి, దివ్యాంగుడు సామ పంగు శ్రీకాంత్ జిల్లాలోని నూతనకల్ మండలం చిల్పకుంట్ల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు తోట సునీతను కులాంతర వివాహం చేసుకొని పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఆదివారం హైదరాబాద్‌లో కుల నిర్మూలన సంఘం ఆధ్వర్యంలో ఆదర్శంగా నిలిచిన దంపతులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జస్టిస్ డా.గురిజాల రాధారాణి పాల్గొని మాట్లాడారు. దేశంలో కుల వ్యవస్థ పోవాలంటే రాబోయే కాలంలో యువత కులాంతర వివాహాలు చేసుకోవాలన్నారు. వారిని ఆదర్శంగా తీసుకొని యువత భవిష్యత్‌లో ముందుకు సాగాలన్నారు. దివ్యాంగ దంపతులను కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో కేంద్ర సాహిత్య అకాడమీ జనరల్ కౌన్సిల్ మెంబర్ ఎస్వీ సత్యనారాయణ, మానవ వికాస వేదిక జాతీయ అధ్యక్షుడు బి.సాంబశివరావు, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క, కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి సైకిలాబ్‌బాబు, నాస్తిక సమాజం నాయకులు బైరి నరేష్, సామాజిక సేవకుడు అంబేద్కర్, బిబిషా తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ పరిశీలన

మోతె : రాఘవాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో గల ఎస్సారెస్పీ 36ఎల్ మేజర్ కాల్వను ఆదివారం ఎమ్మెల్యే నలమాద పద్మావతి ఆదేశాల మేరకు డీఈ రమేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి నీటి వాటా గురించి ఆయనతో చర్చించారు. ఆయన వెంట ఏఈ లింగయ్య, మోతె, నడిగూడెం మండలాలకు చెందిన రైతులు ఉన్నారు.



రైతులతో మాట్లాడుతున్న డీఈ రమేష్

సాగునీటిని విడుదల చేయాలి

నడిగూడెం : ప్రస్తుత యాసంగి సీజన్‌లో ఆయకట్టు గ్రామాలకు సాగర్ నీటిని విడుదల చేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ నియోజకవర్గం అధ్యక్షుడు గుర్రం వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది సాగు కష్టంగా మారిందన్నారు. బావులు, బోర్లలో భూగర్భజలాలు అడుగంటుతున్నాయని, సాగర్ నీరు విడుదల చేస్తే భూగర్భ జలాలు పెరిగే అవకాశముందన్నారు. సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి నీటిని వెంటనే విడుదల చేయాలన్నారు.